# చండీగఢ్ మేయర్ పీఠం ఆప్‌దే

## సర్వోన్నత న్యాయస్థానం సంచలన తీర్పు

- బీజేపీ అభ్యర్థి ఎన్నిక చెల్లదన్న సుప్రీంకోర్టు
- రిటర్నింగ్ అధికారిపై విచారణకు ఆదేశం
- కోర్టు తీర్పుపై ఆమ్‌ఆద్మీ పార్టీ హర్షం
- ప్రజాస్వామ్యమే గెలిచిందన్న కేజ్రీవాల్

చండీగఢ్ మేయర్‌గా ఎన్నికైన ఆప్ కౌన్సిలర్ కుల్దీప్‌కు మిఠాయి తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

న్యూఢిల్లీ/చండీగఢ్, ఫిబ్రవరి 20: చండీగఢ్ మేయర్ ఎన్నికల ఫలితాలపై సుప్రీంకోర్టు మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది. మేయర్‌గా రిటర్నింగ్ అధికారి ప్రకటించిన బీజేపీ అభ్యర్థి మనోజ్ సోన్కర్ ఎన్నిక చెల్లుబాటు కాదని పేర్కొన్న న్యాయస్థానం.. కోర్టులోనే ఓట్ల కౌంటింగ్ నిర్వహించి ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి కుల్దీప్ కుమార్‌ను విజేతగా ప్రకటించింది. గత కౌంటింగ్ సమయంలో రిటర్నింగ్ అధికారి చెల్లుబాటు కావని ప్రకటించిన ఎనిమిది ఓట్లను పరిగణనలోకి తీసుకొన్న న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. గత నెల 30న జరిగిన మేయర్ ఎన్నికల ప్రక్రియలో పలు తీవ్రమైన తప్పిదాలు జరిగినట్టు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం గుర్తించింది. అందుకు బాధ్యుడైన రిటర్నింగ్ అధికారి అనిల్ మాసిహ్‌పై విచారణకు ఆదేశించింది. మొత్తం ఎన్నికల ప్రక్రియను రద్దు చేయడం లేదని కోర్టు పేర్కొన్నది. ఆప్ అభ్యర్థికి అనుకూలంగా పడిన ఎనిమిది ఓట్లను చెల్లుబాటు కావంటూ చేసిన ప్రకటనలో జరిగిన తప్పు వరకు మాత్రమే పరిమితం అవుతున్నామని పేర్కొన్నది. చండీగఢ్ మేయర్ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పత్రాలు, కౌంటింగ్ ప్రక్రియ వీడియోను సీజేఐ ధర్మాసనం పరిశీలించింది. రిటర్నింగ్ అధికారి అనిల్ మాసిహ్ ఎనిమిది బ్యాలెట్ పత్రాలను ఉద్దేశపూర్వకంగానే తారుమారు చేశారనే విషయం స్పష్టమవుతున్నదని పేర్కొన్నది. గత నెలాఖరులో నిర్వహించిన చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో తగినంత సంఖ్యాబలం లేకపోయినా బీజేపీ అభ్యర్థి అనూహ్య విజయం సాధించిన విషయం తెలిసిందే. రిటర్నింగ్ అధికారి అనిల్ ఎనిమిది మంది ఆప్ కౌన్సిలర్ల బ్యాలెట్ పత్రాలను ట్యాంపరింగ్ చేసి, బీజేపీ అభ్యర్థిని విజేతగా ప్రకటించారని పేర్కొంటూ ఆప్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

### ఆప్ కార్యకర్తల సంబురాలు

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో చండీగఢ్‌లోని ఆప్ కార్యాలయం వద్ద కార్యకర్తలు సంబరాలు చేసుకొన్నారు. పార్టీ నేతలు, కౌన్సిలర్లు మిఠాయిలు పంచుకొన్నారు. ఆప్ అభ్యర్థి కుల్దీప్ కుమార్ తీర్పుపై స్పందిస్తూ ఇది ప్రజాస్వామ్యం, చండీగఢ్ ప్రజల విజయమని అన్నారు. ఆప్ అధికార ప్రతినిధి సౌరబ్ భరద్వాజ్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ మేయర్ ఎన్నికల్లో అనైతికతకు పాల్పడిన బీజేపీ నేతలు దేశానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### కోర్టు ప్రజాస్వామ్యాన్ని కాపాడింది

సుప్రీంకోర్టు తీర్పుపై ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. కష్ట సమయాల్లో సుప్రీంకోర్టు ప్రజాస్వామ్యాన్ని కాపాడిందని అన్నారు. 'నిజం ఆఖరుకు గెలిచింది' అని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ సంతోషం వ్యక్తం చేశారు. మేయర్ ఎన్నికల్లో బీజేపీ చేసిన ఘోర తప్పిదానికి తగిన సమాధానం వచ్చిందని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తన తీర్పు ద్వారా భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడిందని కాంగ్రెస్ అభిప్రాయపడింది. చండీగఢ్ మేయర్ ఎన్నికల ప్రక్రియలో సంస్థాగత విధ్వంసం జరిగిందని, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకు మంచుకొండ అంత మోదీ-షా కుట్రలో ఇది ఒక చిన్న ముక్క మాత్రమేనని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. రాజ్యాంగంపై జరుగుతున్న దాడిని భారతీయులందరూ ఉమ్మడిగా ఎదుర్కోవాలన్నారు.

### కౌంటింగ్ కేంద్రంగా కోర్టు రూమ్

చండీగఢ్ మేయర్ ఎన్నిక వివాదంపై తీర్పు ద్వారా సుప్రీంకోర్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. న్యాయమూర్తులు కోర్టు రూమ్‌ను కౌంటింగ్ కేంద్రంగా మార్చి బ్యాలెట్ పత్రాలను లెక్కించారు. తర్వాత ఆప్ అభ్యర్థి మేయర్‌గా విజయం సాధించినట్టు ప్రకటించారు. కుయుక్తుల ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియ నిర్వీర్యం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కోర్టుపై ఉన్నదని న్యాయమూర్తులు పేర్కొన్నారు. తాజాగా మరోసారి మేయర్ ఎన్నిక నిర్వహించాలన్న బీజేపీ అభ్యర్థనను సీజేఐ ధర్మాసనం ఈ సందర్భంగా తిరస్కరించింది.

## మార్చి 9 తర్వాత లోక్‌సభ షెడ్యూల్!

- కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) వచ్చే నెల 9వ తేదీ తర్వాత షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. 2019లో మాదిరిగానే ఈ సారి కూడా ఎన్నికల తేదీలు ఉండవచ్చని భావిస్తున్నారు. 2019 ఎన్నికలకు ఆ ఏడాది మార్చి 10న ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకు పోలింగ్ నిర్వహించారు. ఈ సారి కూడా దాదాపు ఇవే తేదీల్లో షెడ్యూల్, పోలింగ్ ఉండవచ్చని సమాచారం. ఈసీ ఇప్పటికే అన్ని రాష్ట్రాల్లో పర్యటించి ఎన్నికల సన్నద్ధతను పరిశీలిస్తున్నది. జమ్ముకశ్మీర్‌లో భద్రతా పరిస్థితులపై మార్చి 8-9 తేదీల్లో అధికారులతో ఈసీ సమావేశం కావచ్చని, లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్ని ఒకేసారి నిర్వహించటంపై మార్చి 12-13 తేదీల్లో ఈసీ సభ్యులు జమ్ముకశ్మీర్‌లో పర్యటించనున్నారని జాతీయ మీడియా పేర్కొన్నది.

## కనీస మద్దతు ధరపై చట్టానికి పార్లమెంట్ సెషన్ నిర్వహించాలి

- కేంద్రానికి రైతు సంఘాల డిమాండ్

చండీగఢ్, ఫిబ్రవరి 20: పంటలకు కనీస మద్దతు ధరపై(ఎంఎస్పీ) చట్టం తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక రోజంతా పార్లమెంట్ సమావేశం నిర్వహించాలని రైతు నేత శర్వాన్ సింగ్ పంధేర్ డిమాండ్ చేశారు. ఎంఎస్పీకి చట్టబద్ధత, రైతు రుణాల మాఫీతో సహా ఇతర అన్ని డిమాండ్లను నెరవేర్చాల్సిన్నారు. రైతులతో కేంద్ర సంస్థల ఒప్పందం మేరకు ఐదేండ్ల పాటు పప్పు ధాన్యాలు, మక్కజొన్న, పత్తి పంటలను ఎంఎస్పీకి కొనుగోలు చేస్తామని నాలుగో దఫా చర్చల సందర్భంగా కేంద్రం చేసిన ప్రతిపాదనను రైతు సంఘాలు సోమవారం తిరస్కరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రైతు నేత శర్వాన్ సింగ్ పంజాబ్-హర్యానా సరిహద్దు శంభు వద్ద మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఎంఎస్పీపై చట్టం చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఇందు కోసం ఒక రోజంతా పార్లమెంట్ సెషన్ నిర్వహించాలని, దీన్ని ఏ ప్రతిపక్షం వ్యతిరేకించదని అన్నారు. రైతులు చేస్తున్న ఏ డిమాండ్‌ను కేంద్రం అంగీకరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుత ఆందోళనలు చేపట్టేందుకు ఢిల్లీ వైపుగా వెళ్లనీయండి అని మరో రైతు నేత అశోక్ బులరా డిమాండ్ చేశారు.

## ఐటీ నియామకాలు ఢమాల్!

- *2023తో పోలిస్తే ఈ ఏడాది ఏకంగా 78 శాతం తగ్గుదల*
- *నాస్కామ్ నివేదిక అంచనా*

*(స్పెషల్ టాస్క్ బ్యూరో)*

*హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): ఆర్థిక మందగమనం, ఇతర ప్రతికూల పరిస్థితుల ప్రభావం ఐటీ రంగంపై తీవ్రంగా పడుతున్నది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఐటీ కొత్త నియామకాల్లో ఏకంగా 78 శాతం తగ్గుదల ఉంటుందని నాస్కామ్ అంచనా వేసింది. 2023లో ఐటీ పరిశ్రమ 2.7 లక్షల కొత్త ఉద్యోగాలు కల్పిస్తే.. 2024లో కేవలం 60 వేల కొత్త ఉద్యోగాలే ఉంటాయని తన అధ్యయనంలో పేర్కొన్నది. అమెరికా, యూరప్ దేశాల్లో ఆర్థిక మందగమనం వల్ల ఐటీ రంగం కూడా ప్రభావితం అవుతుందని పేర్కొన్నది. 25 వేల కోట్ల డాలర్ల ఐటీ సేవల పరిశ్రమలో 60-80 శాతం ఆదాయం ఉత్తర అమెరికా, యూరప్ మార్కెట్ల నుంచే వస్తుందనేది ఒక అంచనా. కొవిడ్ కాలంలో ఎక్కువగా నియామకాలు జరిగినందున ఈ ఏడాది అంత స్థాయిలో నియామకాలు ఉండకపోవచ్చని, ఉన్న ఉద్యోగులకే అవసరానికి తగ్గట్టుగా సాంకేతిక నైపుణ్యాన్ని పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని నాస్కామ్ ప్రెసిడెంట్ దేబ్జానీ ఘోష్ చెప్పారు. 6.5 లక్షల మంది ఐటీ ఉద్యోగులు అధునిక నైపుణ్యం కోసం శిక్షణ పొందుతున్నారని ఓ నివేదిక పేర్కొన్నది. పెరుగుతున్న సాంకేతికతను అందుకోవడంలో ప్రస్తుత అంతరాలను తగ్గించడం ఐటీ పరిశ్రమ ముందున్న పెద్ద సవాలు అని ఘోష్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), బిగ్ డాటా, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ మొదలైన కొత్త సాంకేతికతలకు సంబంధించిన ఉద్యోగాల డిమాండ్ ఉంటుందని ఆమె చెప్పారు.*

## రాజ్యసభకు సోనియా, నడ్డా

- ఎగువసభకు పోటీలేకుండా ఎన్నిక
- మొత్తం 41 మంది ఏకగ్రీవం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: దాదాపు 25 ఏండ్లు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ తాజాగా రాజ్యసభలో అడుగుపెట్టబోతున్నారు. రాజస్థాన్ నుంచి ఆమె పెద్దలసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా.. గుజరాత్ నుంచి ఎన్నికయ్యారు. దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల తరపున ఖాళీ అయిన 56 రాజ్యసభ స్థానాలకు గాను 41 చోట్ల ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నికయ్యారు. మిగిలిన చోట్ల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 27న ఎన్నిక జరుగనున్నది. ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఇటీవలే కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్, కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, ఎల్ మురగన్ తదితరులు ఉన్నారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌లోని ఖాళీ స్థానాలకు ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహిస్తారు. అత్యధికంగా బీజేపీ 20 స్థానాలు, కాంగ్రెస్ 6 స్థానాలు, తృణమూల్ కాంగ్రెస్ 4, వైఎస్సార్ కాంగ్రెస్ 3, ఆర్జేడీ 2, బీజేడీ 2, ఎన్సీపీ, శివసేన, బీఆర్ఎస్, జేడీ(యూ) చెరొక స్థానాన్ని ఏకగ్రీవంగా గెలుచుకున్నాయి. 41 స్థానాల్లో ఇతర అభ్యర్థులెవరూ పోటీ లేకపోవటంతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిశాక రిటర్నింగ్ అధికారులు వారిని విజేతలుగా ప్రకటించారు. 56 ఖాళీలకు గాను 50 చోట్ల సభ్యులు ఏప్రిల్ 2న పదవీ విరమణ చేయనుండగా.. మరో ఆరు గురు ఏప్రిల్ 3న పదవీ విరమణ చేయనున్నారు. యూపీలో 10, కర్ణాటకలో 4, హిమాచల్‌లో ఒక స్థానానికి ఎన్నిక జరగాల్సి ఉన్నది.

## 3 ఐఐఎంలకు ప్రధాని ప్రారంభోత్సవం

**తెలంగాణలో పలు అభివృద్ధి పనులకూ..**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: దేశంలోని మూడు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) క్యాంపస్‌లకు ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ప్రారంభోత్సవం చేశారు. జమ్ము, బౌద్ధ గయ, విశాఖపట్నంలలోని ఐఐఎం క్యాంపస్‌లను ఆయన ప్రారంభించారు. అలాగే మూడు ఐఐటీలు, 20 కేంద్రీయ విద్యాలయాలు, 13 నవోదయ పాఠశాలల శాశ్వత భవనాలు సహా 13,375 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో తెలంగాణలోని హైదరాబాద్ ఐఐటీ క్యాంపస్ కూడా ఉంది. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ క్యాంపస్‌లో రూ.1,089 కోట్లతో చేపట్టిన పనులను, నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్మించిన కేంద్రీయ విద్యాలయ భవనాన్ని, పాల మూరు యూనివర్సిటీలో పీఎం ఉషా పథకాన్ని ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు.

## దేశంలోనే అతి పొడవైన రైలు సొరంగం

**జమ్ములో ప్రారంభించిన ప్రధాని మోదీ**

*శ్రీనగర్, ఫిబ్రవరి 20: దేశంలోనే అత్యంత పొడవైన రైలు సొరంగాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. జమ్ములో ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు లింకుపై నిర్మించిన ఈ సొరంగం మంగళవారం ప్రారంభమైంది. 48.1 కిలోమీటర్ల పొడవైన బనిహాల్-ఖారీ-సంబర్-సంగల్దాన్ సెక్షన్‌లో ఈ సొరంగం పొడవు 12.77 కిలోమీటర్లుగా ఉంది. దీనిని టి-50గా పిలుస్తారు. 'అత్యవసర పరిస్థితుల్లో టన్నెల్ నుంచి తప్పించుకునేందుకు టి-50కి సమాంతరంగా ఎస్కేప్ టన్నెల్ కూడా ఉంది. సొరంగం లోపల అన్ని భద్రతా చర్యలు తీసుకున్నామని రైల్వే అధికారులు చెప్పారు.*

## మెదడుతో మౌస్ కంట్రోల్!



న్యూఢిల్లీ: బ్రెయిన్ చిప్ ఇంప్లాంట్‌కు సంబంధించి హ్యూమన్ క్లినికల్ ట్రయల్స్‌లో సానుకూల ఫలితాలు వచ్చినట్టు ఎలాన్‌మస్క్‌కు చెందిన న్యూరాలింక్ వెల్లడించింది. ప్రపంచంలోనే తొలిసారిగా గత నెలలో ఓ వ్యక్తి మెదడులో న్యూరాలింక్ బ్రెయిన్ చిప్ అమర్చిన సంగతి తెలిసిందే. ఆ రోగి పూర్తిగా కోలుకున్నాడని, మెదడు ద్వారా కంప్యూటర్ మౌస్‌ను నియంత్రించగలుగుతున్నాడని న్యూరాలింక్ తెలిపింది. ప్రతికూల ప్రభావాలేమీ కనిపించలేదని పేర్కొన్నది. ఆలోచనల ద్వారా మౌస్ బటన్స్‌ను నియంత్రించడం తదుపరి లక్ష్యమని వివరించింది.

## తడిచిన ఐఫోన్‌ను రైస్ బ్యాగ్‌లో పెట్టొద్దు!

- తడిదనం పోగొట్టడం ఇలా కాదు
- ఈ చర్యతో ఫోన్ దెబ్బ తింటుంది
- యూజర్లకు యాపిల్ హెచ్చరిక

*(స్పెషల్ టాస్క్ బ్యూరో)*

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): నీటిలో పడిన మొబైల్ ఫోన్‌ను ఆరబెట్టడానికి కొందరు బియ్యం సంచిలో ఉంచడం చూసే ఉంటాం. అయితే, ఈ చర్యతో ఐఫోన్ మరింత దెబ్బతినే ప్రమాదమున్నదని యూజర్లను యాపిల్ కంపెనీ తాజాగా హెచ్చరించింది. 'నీటిలో పడిన ఐఫోన్‌ను ఆరబెట్టడంలో భాగంగా బియ్యం సంచిలో పెట్టడం వంటి పనులు చేయొద్దు. అలా చేయడం వల్ల బియ్యంలోని మైక్రో రేణువులు ఫోన్‌ను మరింతగా దెబ్బతీస్తాయి' అని యాపిల్ పేర్కొంది. ఫోన్‌ను ఆరబెట్టడానికి హెయిర్ డ్రైయర్స్, కంప్రెస్డ్ ఎయిర్ డివైజ్‌లను కూడా వాడొద్దని తెలిపింది. ప్రమాదవశాత్తూ ఫోన్ నీటిలో పడిపోతే, ఆరబెట్టడానికి యాపిల్ కొన్ని సూచనలు చేసింది. తడిని తొలగించడానికి కనెక్టర్ కిందివైపు ఉండేలా ఫోన్‌ను ఉంచి నెమ్మదిగా చేతితో కొట్టాలని, తర్వాత ఫోన్‌ను పొడిగా ఉండే ప్రదేశంలో ఉంచి.. 30 నిమిషాల తర్వాత మాత్రమే ఛార్జింగ్ పెట్టాలని సూచించింది. ఫోన్ తడిగా ఉన్నప్పుడు అత్యవసరంగా ఛార్జ్ చేయాల్సి వస్తే 'లిక్విడ్ డిటెక్షన్'ను ఓవర్‌రైడ్ చేసే వెసులుబాటు ఉన్నట్టు గుర్తు చేసింది.

## మరాఠాలకు 10% రిజర్వేషన్లు

- బిల్లుకు మహారాష్ట్ర అసెంబ్లీ ఆమోదం

ముంబై(నమస్తే తెలంగాణ): విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో మరాఠా వర్గానికి పది శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును మహారాష్ట్ర శాసనసభ మంగళవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. సీఎం ఏక్‌నాథ్ షిండే మరాఠా కోటాపై బిల్లును సభలో ప్రవేశపెట్టారు. దీనిపై చర్చించిన సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. రాష్ట్ర జనాభాలో మరాఠాలు 28 శాతం ఉన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందటం వల్ల మరాఠా వర్గానికి విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో పదిశాతం రిజర్వేషన్ లభించనున్నాయి. ఈ రిజర్వేషన్లను పదేళ్ల తర్వాత సమీక్షిస్తారు. రాష్ట్రంలో ఇప్పటికే కొన్ని కులాలు, సమూహాలు రిజర్వ్‌డ్ క్యాటగిరీల్లో ఉన్నాయి. అన్నీ కలిపి 52 శాతం రిజర్వేషన్లను అనుభవిస్తున్నాయి. 52 శాతం రిజర్వేషన్లలో షెడ్యూల్డ్ కులాలు 13 శాతం, షెడ్యూల్డ్ తెగలు 7 శాతం, ఓబీసీలు 19 శాతం, ప్రత్యేక వెనుకబడిన తరగతులు 2 శాతం, విముక్త జాతి 3 శాతం, సంచార తెగ(బీ) 2.5 శాతం, సంచార తెగ(సీ) ధన్గర్ 3.5 శాతం, సంచార తెగ (డీ) వంజరి 2 శాతం రిజర్వేషన్లను కలిగి ఉన్నాయి.

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో భారతీయులు

- ఏజెంట్ల మోసాలతో చిక్కుకొన్న పలువురు ఉద్యోగార్థులు
- బాధితుల్లో హైదరాబాదీ

న్యూఢిల్లీ: ఏజెంట్ చేసిన మోసంతో పలువురు భారతీయులు రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో చిక్కుకుపోయారు. రెండు దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధంలో ముగ్గురు భారతీయులను రష్యా సైన్యం తమ తరపున పోరాడేందుకు బలవంతంగా వినియోగించుకొంటున్నది. అధిక వేతనాలు అంటూ ఎర చూపి వీరందరినీ ఒక ఏజెంట్ మభ్యపెట్టి, ఆర్మీ సెక్యూరిటీ సహాయకులుగా అక్కడకు పంపినట్టు బాధితుల్లో ఒకరు తెలిపినట్టు ది హిందూ పేర్కొన్నది. గత ఏడాది నవంబర్ నుంచి 18 మంది భారతీయులు రష్యా-ఉక్రెయిన్ సరిహద్దుల్లో చిక్కుకుపోగా.. ప్రస్తుతం రెండు దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధంలో ఒకరు మరణించారని ఓ ఏజెంట్ తెలిపారు. బాధితుల్లో ఒకరు హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి కాగా.. సాయం చేయాలని అతని కుటుంబం గతనెల 25న ఎంపీ అసుద్దీన్ ఒవైసీని ఆశ్రయించింది. తర్వాత ఈ వ్యవహారంపై జోక్యం చేసుకోవాలని, బాధితులను తిరిగి దేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒవైసీ విదేశాంగ శాఖ మంత్రి జయశంకర్, మాస్కోలోని భారత ఎంబసీకి లేఖ రాశారు. బాధితులు యూపీ, గుజరాత్, పంజాబ్, జమ్ముకశ్మీర్‌లకు చెందిన వారిగా తెలుస్తున్నది. తమలో ముగ్గురికి రష్యా సైన్యం ఆయుధ వినియోగంపై శిక్షణ ఇచ్చిందని, జనవరిలో రొస్తోవ్ సరిహద్దుకు పంపిందని, గన్‌పాయింట్‌లో బలవంతంగా యుద్ధం చేయాల్సి వచ్చిందని ఓ బాధితుడు పేర్కొన్నాడని ది హిందూ నివేదించింది.



## బార్బీ భామతో పుతిన్ ప్రేమాయణం

మాస్కో, ఫిబ్రవరి 20: బార్బీ భామతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ లేటు వయసులో ఘాటు ప్రేమలో పడ్డారు. 71 ఏండ్ల పుతిన్ 39 ఏండ్ల కాత్యా మిజులినాతో పీకల్లోతు ప్రేమలో ఉన్నట్టు రష్యా మీడియా కోడై కూస్తున్నది. బార్బీ బొమ్మలా కనిపించే ఏకథరినా కాత్యా మిజులినా లండన్‌లో గ్రాడ్యుయేషన్ చేసి, ప్రస్తుతం రష్యా సేఫ్ ఇంటర్నెట్ లీగ్ చీఫ్‌గా పనిచేస్తున్నారు. ఏకథరినా మిజులినాతో ఆయన కొంతకాలంగా ప్రేమాయణంలో ఉన్నట్టు రష్యాలోని సామాజిక మాధ్యమంలో విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది. పుతిన్‌కు అనుకూలుడైన మాజీ సెనెటర్ కుమార్తెయే మిజులినా. కాగా, మాజీ ఫ్లైట్ అటెండెంట్ ల్యూడిమిలాను పుతిన్ 1983లో వివాహం చేసుకుని 2014లో విడాకులు ఇచ్చారు. అనంతరం ఒలింపిక్ బంగారు పతక విజేత అయిన జిమ్నాస్ట్ అలినా కబేవాతో రహస్య సంబంధాన్ని కొనసాగించాడని, వారికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారని ఆరోపణలున్నాయి.

## కొవిడ్ టీకాతో గడ్డకడుతున్న రక్తం!

న్యూఢిలీ: కొవిడ్-19 వ్యాక్సినేషన్ తర్వాత వివిధ దేశాల్లో (భారత్ మినహా) టీకా తీసుకున్న వారిలో గుండె సమస్యలు, మెదడు రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం వంటి దుష్ప్రభావాలు తలెత్తుతున్నాయని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. కొవిడ్-19 టీకా దుష్ప్రభావాలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో), యూరోపియన్ మెడిసిన్స్ ఏజెన్సీ కీలక డాటా సేకరించింది. ద గ్లోబల్ కొవిడ్ సేఫ్టీ ప్రాజెక్ట్.. పేరుతో కొవిడ్ టీకాల పనితీరును మదింపు చేసింది. భారత్ మినహా వివిధ దేశాల్లో 9.9 కోట్లమంది పేషెంట్ల నుంచి డాటాను సేకరించి ఈ నివేదికను రూపొందించినట్టు తెలిసింది. ఎంఆర్ఎన్ఏ కొవిడ్ టీకాలు తీసుకున్నవారిలో గుండె సమస్యలు, మెదడు రక్తనాళాల్లో గడ్డకట్టడం వంటివి 1.5 రెట్లు పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. ఈ తరహా టీకాలే భారత్‌లోనూ పెద్ద సంఖ్యలో తీసుకున్నారని, దీని ప్రభావం ఏంటన్నది మాత్రం శాస్త్రీయంగా బయటకు రాలేదని వైద్య నిపుణులు చెబుతున్నారు.

## డీప్‌ఫేక్‌కు వాట్సాప్ చెక్!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): డీప్‌ఫేక్ వీడియోలు, వాయిస్ మెసేజ్‌లు కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో టెక్ దిగ్గజం మెటా కీలక నిర్ణయం తీసుకుంది. డీప్‌ఫేక్‌లను కట్టడి చేయడానికి వాట్సాప్‌లో ప్రత్యేక ఫ్యాక్ట్ చెక్ హెల్ప్‌లైన్‌ను తీసుకురానున్నట్టు పేర్కొంది. కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ) ఆధారంగా పనిచేయనున్న ఈ చాట్ బోట్ వచ్చే నెల నుంచి అందుబాటులోకి రానున్నట్టు వెల్లడించింది. ఈ మేరకు 'మిస్‌ఇన్ఫర్మేషన్ కంబాట్ అలయన్స్' తో భాగస్వామ్యం అవుతున్నట్లు వివరించింది. ఎంసీఏ, దాని అనుబంధ స్వతంత్ర ఫ్యాక్ట్-చెకర్లు, పరిశోధన సంస్థలు వైరలవుతున్న తప్పుడు సమాచారాన్ని, ముఖ్యంగా డీప్‌ఫేక్‌లను గుర్తిస్తాయని మెటా వెల్లడించింది. ఇంగ్లిష్‌తో పాటు హిందీ, తమిళం, తెలుగు భాషల్లో ఈ సేవలను ప్రారంభించనున్నట్టు తెలిపింది.

## పుణే, ఢిల్లీలో 2 వేల కోట్ల డ్రగ్స్ సీజ్

పుణే: మహారాష్ట్రలోని పుణె జిల్లా, న్యూఢిల్లీలో రూ.2,000 కోట్ల విలువైన 1,100 కిలోల మెఫెడ్రోన్ డ్రగ్‌ను పోలీసులు సీజ్‌చేశారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని, మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని పుణే సిటీ కమిషనర్ అమితేశ్‌కుమార్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. తొలుత ఆదివారం ముగ్గురు నిందితులను అరెస్టుచేసి పుణే జిల్లాలో 400 కేజీల మెఫెడ్రోన్ డ్రగ్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. విచారణలో నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా.. ఢిల్లీలోని గోదాములపై సైతం దాడులు నిర్వహించి మొత్తం 1,100 కిలోల మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

## సమాజ్‌వాదీని వీడిన స్వామి ప్రసాద్ మౌర్య

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ప్రముఖ బీసీ నాయకుడు, మాజీ మంత్రి స్వామి ప్రసాద్ మౌర్య సమాజ్‌వాదీ పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. మంగళవారం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, అలాగే ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేశారు. ఈ నెల 22న కొత్త పార్టీని ప్రకటిస్తానని తెలిపారు. ప్రసాద్ మౌర్య 2022 అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీని వీడి ఎస్పీలో చేరారు. అయోధ్యలో రామాలయం, రామ్‌చరిత్ మానస్‌పై స్వామి ప్రసాద్ మౌర్య చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి.

## రోజుకో సూర్యుడు హాంఫట్!

- విశ్వంలోనే అత్యంత ప్రకాశవంతమైన క్వాసర్ గుర్తింపు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: విశ్వంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న ఓ కృష్ణబిలాన్ని (బ్లాక్‌హోల్‌ను) శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఓ క్వాసర్ (అత్యంత ప్రకాశవంతమైన నక్షత్రం లాంటి వస్తువు) మధ్యలో ఉన్న ఈ కృష్ణబిలం ప్రతిరోజూ సూర్యుడి పరిమాణానికి సమానమైనంత పదార్థాన్ని మింగేస్తున్నట్టు గుర్తించారు. భూగోళానికి 1,200 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ఈ క్వాసర్ సూర్యుని కంటే 500 లక్షల కోట్ల రెట్లు అధికంగా ప్రకాశిస్తున్నదని, విశ్వంలో అత్యంత ప్రకాశవంతమైన క్వాసర్ ఇదేనని ఆస్ట్రేలియా నేషనల్ యూనివర్సిటీ (ఏఎన్‌యూ) పరిశోధకులు వెల్లడించారు. ఆ క్వాసర్‌లోని బ్లాక్‌హోల్ సూర్యుని కంటే 1,700 కోట్ల రెట్లు అధి